ప్రజాశక్తి
శనివారం 07 జూన్ 2025
5
కర్నూలు



సంతకం చేసి బాధ్యతలు స్వీకరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పదవుల పందేరం..!

- సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు
- స్థానం దక్కించుకునేందుకు కూటమి నాయకుల ప్రయత్నాలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమనే సొసైటీ ఛైర్మన్‌గా నియమించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు.



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్‌లు) ఉన్నాయి. ఆయా పాలకవర్గాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఆరు నెలలపాటు త్రిసభ్య కమిటీలతో ఆయా సొసైటీలను నడపాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక సహకార సంఘాల కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు పలువురు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. తమనే సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా నియమించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు గట్టిగా సాగిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చివరిగా 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. 2018లో పదవీకాలం ముగియగా అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను తెరపైకి తీసుకొచ్చింది. గతేడాది జులై నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. ఆ వెనువెంటనే కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించింది. పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లవుతున్నా అటు ప్రాథమిక సహకార సంఘాలకు, ఇటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. పర్సన్ ఇన్‌ఛార్జీలతో పాలన నడుపుతున్నారు. ప్రస్తుతం సొసైటీల అధ్యక్ష, డైరెక్టర్ల స్థానాలకు గ్రామస్థాయి నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం టిడిపిలో ఆశావహులు పెరిగిపోయారు. దీనికితోడు బిజెపి, జనసేన నేతలు కూడా పదవులు ఆశిస్తున్నారు. తమకూ కొన్ని సంఘాలు కేటాయించాలని ఆ రెండు పార్టీల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. ఒక్కో సొసైటీకి ఒక ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్లను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు, డిసిఎంఎస్ సొసైటీలకు ఏడుగురు సభ్యులతో సెవెన్‌మెన్ కమిటీలను నియమించనున్నారు. డిసిసిబికి పెద్దఎత్తున పోటీ నెలకొంది. తమ అనుయాయులనే నియమించాలని ఉమ్మడి జిల్లా నుంచి పలువురు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. డిసిఎంఎస్ పదవులకు కూడా చాలా మంది పోటీ పడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన వారికి సహకార సొసైటీల ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించే ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. నియోజకవర్గ ఎమ్మెల్యేల నుంచి జిల్లా సహకార అధికారి కార్యాలయానికి, పార్టీ అధిష్టానానికి నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు పంపారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పోటీ పడుతుండడంతో ఎవరిని పరపతి సంఘాల పదవులు వరిస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

త్యాగనిరతికి ప్రతీక 'బక్రీద్'

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ / కర్నూలు కార్పొరేషన్

పండుగలు సంస్కృతికి ప్రతిబింబాలు. ఐక్యతకు నిర్వచనాలు. ఎవరి మతాలనైనా, ఎవరి సంప్రదాయాలనైనా గౌరవించే సంస్కారం భారతీయులకుంది. అటువంటి భారతదేశంలో పుట్టిన ప్రతిఒక్కరూ సమత, మమతలను ఆభరణాలుగా జీవిస్తారు. అది భారతదేశ గొప్పదనం మనకున్న మూలధనం. భారతదేశంలో ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో 'బక్రీద్' ఒకటి. బక్రీద్‌ను 'ఈదుల్ జుహ' అని పేరు. ఇస్లాం ధర్మాన్ని ఆచరిస్తూ హిజ్రీ శకం క్యాలెండరు ప్రకారం వచ్చే పన్నెండు నెలల్లో జిల్‌హజ్ నెలలో వస్తుంది. రంజాన్ నెలలాగే చంద్రమానం అనుసరించే పండుగ చేసుకుంటారు. మహమ్మదీయులు హిజ్రీశకాన్ని అనుసరిస్తారు. హిజ్రీ అంటే తరలిపోవడం లేదా వలస వెళ్ళడమని అర్థం. ఈ విధంగా హజ్ యాత్రకు వెళ్ళడం వల్ల హిజ్ర అనే పేరుంది. మహమ్మద్ ప్రవక్త మక్కా నుండి మదీనాకు తరలి వెళ్లిన సందర్భంగా చేసుకొనే పండుగే 'బక్రీద్'

పవిత్ర ఖురాన్‌లో బక్రీద్ గూర్చి...

బక్రీద్ అంటే బకర్ ఈద్ అని వ్యవహరిస్తారు. బకర్ అంటే గొర్రె. ఈద్ అంటే పండుగ. జంతువును బలిగా ఇవ్వడం అంటే ఖుర్బానీ ఇచ్చే పండుగ. అందుకే ఈదుల్ ఖుర్బాని, ఈదుల్ జుహ అంటారు. ఈ పండుగను ప్రతి ముస్లి తన ఆర్థిక స్థోమత దృష్ట్యా ఖుర్బాని ఇవ్వడం సంప్రదాయంగా పాటిస్తారు. ఖుర్బానీ ఇవ్వడం అంటే దైవాజ్ఞను ప్రాణత్యాగానికి పూనుకోవడం.

నేపథ్యం: అల్లాహ్ భూమికి పంపిన ప్రవక్తలలో ఇబ్రహీం ఖలీలుల్లా ఒకరు. ఖలీలుల్లా నిర్మంచిన పట్టణమే మక్కా. ప్రజలు నివాసమేర్పరచుకుని సుఖశాంతులతో ఆనందంగా గడిపేలా నిర్మంచాడు. అల్లాహ్‌ను ఆరాధించేందుకు 'కాబా' అనే ప్రార్థనా ప్రాంగణాన్ని నిర్మించాడు. ఇబ్రహీం ఖలీలుల్లాకు పెళ్లయి చాలా సంవత్సరాలు గడిచినా పిల్లలు కలుగలేదు. సంతానం కోసం బేబి హాజీరాను చేసుకుంటాడు. ఆమెకు పుత్రుడు పుడతాడు. ఇస్మాయిల్ జబీవుల్లాగా నామకరణం చేస్తారు. తండ్రి అడుగుజాడల్లో ఆదర్శవంతంగా పెరుగుతాడు. ఒకరోజు ఇబ్రహీం ఖలీలుల్లాకు కల వస్తుంది. తన కొడుకును బలి ఇవ్వాలనే సందేశం వస్తుంది. ఆ విషయాన్ని కొడుక్కి చెబుతాడు. కుమారుడు జబీవుల్లా ప్రాణత్యాగానికి సిద్ధమవుతాడు. ఇబ్రహీం తన కొడుకును నేలపై పడుకోబెట్టి గొంతుకోయడానికి సిద్ధమవుతుండగా కుమారుడు అబ్బాజాన్ నా గొంతు కోసేందుకు మీ చేతులు సహకరించవు, ఈ సంఘటన చూసేందుకు మీ కళ్ళకు సాధ్యం కాదు. కాబట్టి కళ్ళకు గంతలు కట్టుకోమంటాడు. కుమారుడు చెప్పినట్టే కళ్ళకు గంతలు కట్టుకుని కత్తి తీసుకొని గుండెను రాయిగా చేసుకొని గొంతును వధించేందుకు ప్రయత్నిస్తాడు. ఎంతకీ సాధ్యంకాదు. కోపంతో కత్తిని విసిరేస్తాడు. కత్తి విసిరిన వేగానికి అంతర్వాణికి వినబడుతుందట.. 'నన్ను ధిక్కరిస్తున్నావు కదూ దైవాజ్ఞ నీకందింది కాని, నాకు అందలేదు.. నేనే తెగనివ్వలేదు అని వినబడుతుంది'. మళ్ళీ కత్తి తీసుకొని ఈ సారి బలంగా వధించేందుకు సిద్ధమవుతాడు. అప్పుడు అల్లాహ్ ఆయన త్యాగనిరతికి, దైవసంకల్పానికి మెచ్చి జిబ్రాయిల్ అనే మాత ద్వారా దుంబను (భారీ పొట్టేలు లాంటి జంతువు) పంపి ఇస్మాయిల్ జబీవుల్లాను పక్కకు పంపి ఆ స్థానంలో దుంబను తెగకోయిస్తాడు. దాన్ని ఖుర్బానీగా వ్యవహరిస్తారు. ఖుర్బానీ సత్య ధర్మాలను బోధించడానికి, దైవాజ్ఞనుపాటించడానికి బక్రీద్‌లో ఖుర్బానీ జాతికి సందేశం అందిస్తుంది.

హజ్ యాత్ర : బక్రీద్ పండుగ సందర్భంగా మక్కాలోని కాబాను దర్శించి దైవానుగ్రహం పొందడానికి ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు హజ్ యాత్ర చేస్తారు. లక్షలమంది యాత్ర చేసి మక్రీదు నాడు జరిగే ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొంటారు. బక్రీదు రోజున ప్రత్యేక నమాజు పదిగంటలలోపు పూర్తవుతుంది. ఈ నమాజు పూర్తయ్యేంత వరకు ఏమి తినకూడదు. జింక కూడా తన బిడ్డకు పాలివ్వకుండా ఒంటికాలితో నిలబడి వుంటుందని పవిత్ర హదీసులో వుంది.

ఖుర్బానీ ఇవ్వడం : ఖుర్బానీగా కోడిని గాని, కోడి పుంజునుకాని బలి ఇవ్వరు. ఖుర్బానీకి తగిన జంతువులుగా మేక, గొర్రె, దుంబ, ఒంటె మొదలైనవి. ఖుర్బానీకి ఇచ్చే జంతువులు పూర్తిగా ఆరోగ్యవంతంగా ఉండాలి. ఖుర్బానీగా వధించిన మాంసాన్ని మూడుభాగాలుగా విభజించి ఒకభాగం పేదలకు, ఒక భాగం బంధుమిత్రులకు, ఒక భాగం తాము తీసుకుంటారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువులు ఎవరిపేరుమీద ఇస్తారో వారి మరణానంతరం పుల్ సిరాత్ మీద వారి ఆత్మ, ఖుర్బానీ ఇచ్చిన జంతువు ఆత్మ స్వర్గానికి చేరుకుంటుందని ఖురాన్ ద్వారా తెలుస్తుంది. అని నమ్ముతారు. బక్రీద్ పండుగలో కూడా దూద్ ఖుర్మా పాయసం చేస్తారు. కొత్తబట్టలు ధరిస్తారు. ఈద్గాకు వెళ్ళ ప్రత్యేక నమాజు చేస్తారు. పేదలకు దాన ధర్మాలు చేస్తారు. మిత్రులకు, అన్ని మతాల వారికి ఈద్ ముబారక్ తెలుపుకుంటూ ఆలింగనం చేసుకుంటారు. ఇనాములు ఇచ్చుకుంటూ మాంసం పంచుకుంటూ ఆనందంతో గడుపుతారు. బలిదానాల పండుగగానే కాక, సమైక్యతకు చిహ్నంగా ఈ పండుగను భావిస్తారు.

బక్రీదు నమాజ్ వేళలు

కర్నూలు నగరంలోని బక్రీదు నమాజ్ వేళలు ఇలా ప్రకటించారు. హజరత్ లతీఫ్ లవ్ బాలిమజీద్ వద్ద 6:5 గంటలకు, అక్సా వాటర్ వర్క్స్ 6:10కి, మజీద్ సలీం ఎంపీల ఆఫీస్ 6:15 నిమిషాలు. నజీదే మాసంబాష 6:30, పీలి మసీద్ 6-30 గంటలకు మజీద్ షామీయా 7:00 గంటలకు, మజీదే సలాం నగర్ 7-00 గంటలకు, మజీద్ మొగల్పురా మసీద్ బండి మెట్ట , మజీద్ పోలీస్ లైన్ 7:30 గంటలకు, మజీద్ రెహమాన్ నందికొట్కూరు రోడ్డు , మజీదే గఫూరియా, మజీద్ ఇబ్రస్,మ ఖలిక్ లింగ 8:00 గంటలకు, మజీదే కాలే కరీం, మజీద్ హబ్ సూరత్ బడే సాహెబ్ , మజీద్ అక్బర్ సాహెబ్ 8:30 గంటలకు, మస్జిద్ రిసాల్దార్ 9 గంటలకు, నస్జీదే ఇసాకియా రోజా దర్గా 10 గంటలకు ఈద్ నమాజ్‌లు నిర్వహిస్తామని ఖాజీ తెలిపారు.

పేదల పక్షాన ఉంటే..

ఫ్యాక్షనిస్టు ముద్ర వేశారు

- చివరి శ్వాస వరకు పార్టీని వీడను
- నా స్థాయికి చిన్న పదవి
- సిఎం, పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా
- కెడిసిసిబి ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారంలో డి.విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కెడిసిసి బ్యాంక్ నూతన ఛైర్మన్‌గా డి.విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. కెడిసిసి బ్యాంక్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాక కార్యకర్తలు అభిమానులు మధ్య 29 వ ఛైర్మన్‌గా సిఇఒ పి.రామాంజనేయులు ఆధ్వర్యంలో బాధ్యతలను తీసుకున్నారు. ముఖ్య అతిధులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ,కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, పార్టీ పరిశీలకులు రామలింగారెడ్డిలు హాజరయ్యారు. నూతన ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడినందుకు ఫ్యాక్షనిస్ట్ అని ముద్ర వేశారన్నారు. కొన్ని అరాచక శక్తులను అణిచివేయాలని ప్రజలకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని తపన పడ్డానన్నారను. ఎన్‌టిఆర్ పార్టీ పెట్టినప్పటి నుండి నేటిదాకా పార్టీని వదల్లేదు. తన చివరి శ్వాసవరకు పార్టీని విడవనని అన్నారు. అనేక కారణాలతో జైల్లో వేసినా నేటికి ప్రజలు నాతో పాటు నిలిచిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ పదవి తన స్థాయికి తక్కువే అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని ఎప్పటికి అమలు చేస్తానని, రైతులకోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. బ్యాంక్ రాష్ట్రలో 5వ స్థానంలో ఉందని, మూడవ స్థానానికి రావాలని సిఇఒ కోరారన్నారు. కానీ మొదటిస్థానం కోసం పాటు పడేలా ఎమ్మెల్యేలు, అధికారులు, సహకార సంఘాల డైరెక్టర్లు, బ్యాంక్ అధికారుల సహకారంతో ఆ విధంగా ముందుకు వెల్దామని అన్నారు. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 1991 ఫిబ్రవరి 8లో స్థాపించాలరని, 106 సంవత్సరాలుగా రైతాంగానికి వివిధ సేవలు అందిస్తున్నదన్నారు. రూ.4000 కోట్ల వ్యాపారంతో రాష్ట్రలోనే 5వ పెద్ద బ్యాంకుగా గుర్తింపు ఉందన్నారు. 2022 నుండి లాభాలతో నడుస్తుంద న్నారు. 2025-26వ సంవత్సరంలో వ్యాపారాన్ని రూ.4000 కోట్ల నుండి రూ.4500 కోట్లకు పెంచి లాభాల బాట పట్టిస్తానని అన్నారు. ఈ ఏడాది నుండి ఎడ్యుకేషన్‌లోన్, ఇళ్లకు, వాహనాల లోన్‌లపై దృష్టి సారిస్తామని బ్యాంకు ద్వారా, సహకార సంఘాల ద్వారా గోల్డ్‌లోన్స్, పొదుపు లక్ష్మీ రుణాలు విరివిగా మంజూరు చేయుటకు చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రతిష్టాత్మకముగా చేపట్టిన పిఎం సూర్య ఘర్, ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. కౌలు రైతులకు కూడా అత్యధికంగా రుణాలు ఇచ్చేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని సహకార వ్యవస్థను పటిష్ఠం చేయడానికి అన్ని సంఘాల యాజమాన్యం, బ్యాంకు, సహకార శాఖ, జిల్లా పరిపాలన యంత్రాంగంతో కో-ఆర్డినేట్ చేసుకొని బ్యాంకు పురోభివృద్ధికి నా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఉద్యోగులందరు బ్యాంకు అభివృద్ధిలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల పాలనపై దృష్టి పెట్టిందని, ప్రజల నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డికి పదవి తక్కువ అయినా రైతు బిడ్డగా రైతాంగానికి సేవ చేసే సత్తా ఆయనకు ఉందన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఈ రోజు ఎమ్మెల్యేగా ఈ స్థానంలో కూర్చుని మాట్లాడుతున్న అంటే రాజవర్ధన్ రెడ్డి నిర్ణయం, అలుపెరగని విష్ణువర్ధన్ రెడ్డి పోరాటమే అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి ఛైర్మన్ అయితే రాష్ట్రంలో బ్యాంకును మొదటి స్థానానికి తీసుకెళ్తారని అందుకు ప్రతి ఒక్కరు కషి చేస్తామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డికి పదవి స్థాయిలో తక్కువ అయినా ఉమ్మడి జిల్లా రైతాంగానికి సరైన పరిపాలన రైతు బిడ్డగా అందిస్తారని అన్నారు. సిఇఒ రామాంజనేయులు మాట్లాడుతూ బ్యాంక్ ఛైర్మన్ గా ఎన్నిక కావడం రైతు కుటుంబం నుండి అనుభవజ్ఞులైన విష్ణువర్ధన్ రెడ్డి రావడం చాలా శుభపరిణామం అన్నారు. బ్యాంక్‌ను మరింత లాభాలు ఆర్జించేలా ప్రతి ఉద్యోగి పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. అనంతరం ఛైర్మన్‌ను ప్రజాప్రతినిధులను సిఇఒ రామాంజనేయు లు, అధికారులు కలిసి సన్మానించారు. జిల్లా సహకార అధికారి ఎన్. రామాంజనేయులు, బ్యాంక్ అధికారులు త్రినాథ్ రెడ్డి, టిడిపి నాయకులు, విష్ణువర్ధన్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధం ఆవిష్కరణ

కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ ప్రత్యేక అనుబంధాన్ని ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ప్రచురించింది. ఈ అనుబంధాన్ని కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి,ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జ్ రాజు, స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్, జర్నలిస్ట్ మునిస్వామి లు ఆవిష్కరించారు.



ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

9న విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమం

జయప్రదానికి కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖ ఉక్కులో తొలగించిన 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయరాదని కేంద్ర కార్మిక సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 9న తలపెట్టిన ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని శుక్రవారం కర్నూలు ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ గత నెల 20 నుంచి విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న సమ్మెను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగ్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. పోలీసులను, పారమిలిటరీ దళాలను పెట్టి కార్మికులను భయాందోళన గురి చేస్తున్నారని, తక్షణమే తొలగించిన 2500 కాంట్రాక్టు కార్మికులను విధులలోకి తీసుకొని, పెండింగ్ లోఉన్న 8 నెలల కార్మికుల జీతాలు చెల్లించేందుకు, విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు. ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు కర్నూలు జిల్లా పరిషత్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి మారెళ్ళ విజయ్, ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, ఆటో యూనియన్ జిల్లానాయకులు ఈశ్వర్, మహిమూద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నల్లన్న, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో చేసిన అభివృద్ధి వైసిపికి కనపడదా?

-టిడిపి నాయకులు ధనంజయుడు

ప్రజాశక్తి-మద్దికేర : కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు వైసిపికి కనపడవా అని టిడిపి కర్నూలు పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి గూడూరు ధనంజయుడు అన్నారు. మద్దికేరలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నాయకులు ఈనెల 4న వెన్నుపోటు దినం అని పత్తికొండలో ర్యాలీని ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సంక్షేమ పథకాలను ఇవ్వలేదని చెప్పి బూటకం మాటలు మాట్లాడటం, సిఎం చంద్రబాబు నాయుడు మీద విమర్శలు చేయడం సరికాదన్నారు. 16వేల పై చిలుకు డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం కూడా ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు రంగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పారా రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్ష

జిల్లా కలెక్టర్, డిఇఒ పర్యవేక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్‌సి ఆన్‌లైన్ పరీక్ష తొలిరోజు శుక్రవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. మొత్తం ఈ పరీక్షకు1518 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా1339 మంది హాజరయ్యారు. 179 మంది గైర్హాజరయ్యారు. కర్నూలు నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష, డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ పరీక్ష నిర్వాహణను పర్యవేక్షించారు. జిల్లాకు సంబంధించి మొత్తం 17 సెంటర్లలో డిఎస్‌సి పరీక్షలు జరుగుతున్నాయని, మొత్తం 55 వేల 177 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు అవుతున్నారని కలెక్టర్ తెలిపారు. డిఎస్‌సి పరీక్షలను పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టంగా బందోబస్తును ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాష, డిఇఒ శామ్యూల్‌పాల్

మట్కా స్థావరాలపై పోలీసుల దాడులు

-ఏడుగురు మట్కా బీటర్ల అరెస్టు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు పట్టణంలో మట్కా స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడులు జరిపారు. వారి వద్దనున్న 2,30,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడుమూరు పట్టణానికి చెందిన వీర రాజు నాయుడు, లింగ బలిజే విజయ్ కుమార్, బోయ దివాకర్, కల్లపరి నగేష్ ,లింగ బలిజ గీత, బోయ కాశి, బోయరెడ్డి రాజులు మట్కా నిర్వహిస్తున్నట్లు ఎస్‌పికి, డిఎస్‌పికి ఫిర్యాదులు అందాయి. దీంతో సిఐ ఉత్తర్వుల మేరకు కోడుమూరు ఎస్ఐ డివై.స్వామి పోలీస్ సిబ్బంది బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించారు. రాజు నాయుడు, విజయ్ కుమార్, దివాకర్ కల్లపరి నగేష్, బోయ కాశి, లింగ బలిజ గీత లను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న మక్కా చీటీలను 2,30,000 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టయిన మట్కాబీటర్లు, మాట్లాడుతున్న పోలీసు అధికారులు

వంట వార్పుతో నిరసన

కాంట్రాక్టు ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఉధృతం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

గత 31 రోజులుగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల జీతాల పెంపుదల , ఇతర డిమాండ్లపై సమ్మె చేస్తున్నారు. కార్మికులతో ప్రభుత్వ చర్చలు విఫలమవడంతో కర్నూలు నగరంలోని నీటిని శుద్ధి చేసే కర్మాగారంలో పనిచేసే కార్మికులు, పైప్ లైన్ లీకేజీ వర్కర్లు, పార్కు కార్మికులు వీధిదీపాల కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వాచ్మెన్ లు విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీత భత్యాలను పెంచేంత వరకు తమ సమ్మెను విరమించబోమని సమ్మె శిబిరంలో వంటా వార్పు చేశారు. సమ్మె మొదలై 31 రోజులు అవుతున్నా కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారను. కార్మికులకు కనీస వేతనం కూడా అమలు చేయకుండా వారితో వెట్టిచాకిరీ చేయించడం అన్యాయమన్నారు. బయట పని చేసే వ్యక్తులకు మినిమం రూ. ఎనిమిది వందలు కూలి ఉందని, కార్మికులకు ఆ కూలీలు కూడా అమలు చేయలేకపోవడం చాలా అన్యాయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే వైసిపి ఇన్చార్జిగా మున్సిపల్ ఇంజనీర్ కార్మికులందరికీ పూర్తి మద్దతును ఇస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి కూడా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంజనీర్ కార్మికుల సమస్యలను వెంటనే తీసుకొని వెళ్తామన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంటు ఉద్యోగస్తులతో సమానంగా పనిచేస్తున్న వారికి జీతంలో వ్యత్యాసం చూపడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాసిన్ బేగ్, రాష్ట్ర కోశాధికారి సుమీర్‌బాష రాష్ట్ర సహాయ కార్యదర్శి సినాగశేషులు, పార్కు నాయకురాలు జ్ఞానమ్మ, ప్రకాష స్ట్రీట్ లైట్ కార్మికులు శాలరాజు, ఎల్లప్ప, పంపు హౌస్ ఎలక్ట్రీషన్ రమేష్, దానేలు, శివ సుధాకర్, రమణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

అధికఫీజుల వసూళ్లను ఆపాలి

కార్పొరేట్ , ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో పుస్తకాల పేరుతో అధిక ఫీజులను వసూళ్లను ఆపాలని, వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర ప్రధాన కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర ప్రధాన కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచి అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా పాఠశాలలో ప్రారంభం కాకముందే పుస్తకాల ఫీజుల పేరుతో అధిక డబ్బులను వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ విద్యా సంస్థలపై దాడులు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేయకుండా నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, అంజి, మల్లేష్, నగర సహాయ కార్యదర్శి పథ్వి, నగర కమిటీ సభ్యులు యోగి, హర్ష పాల్గొన్నారు.

విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ నెల 8,9 తారీఖులలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని కేడెట్స్ డిఫెన్స్ అకాడమీ సంస్థ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కర్నూలు నగరంలో బిర్లా కాంపౌండ్ లోని కృష్ణకాంత్ ప్లాజా,మొదటి అంతస్తు,షాప్ నంబర్ 21,22 లోని క్యాడెట్ డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు నగరంలో తొలిసారిగా ఒక కోచింగ్ సెంటర్‌ను నవోదయ ,ఆర్ఎంఎస్ ,కలికిరి, కోరుకొండ సైనిక్ స్కూల్స్ కోచింగ్ కోసం టెక్నో వర్షన్‌లో ఏర్పాటు చేశామన్నారు. విద్యారంగంలో 35 సంవత్సరాల అనుభవం కలిగిన కస్తూరి స్కూల్స్ వారి సారథ్యంలో,అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్ట్ లో ఏవిధంగా మార్కులు తెచ్చుకోవాలో ఏ విధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలో అవగాహన సదస్సులో వివరిస్తామన్నారు. తెలివైన విద్యార్థులకు కూడా రూ.లక్షలు చెల్లించి ప్రైవేట్ స్కూల్స్ లో చదివించటం అనేది ఈ రోజుల్లో ప్రతి తల్లి తండ్రులకు భారంగా మారిందన్నారు. మన ప్రభుత్వాలు అందించే విద్యా విధానం లోని రాయితీల గురించి అవగాహన లేక తల్లిదండ్రులు పిల్లల ఫీజుల భారం మోస్తూనే ఉన్నారన్నారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కస్తూరి చంద్రశేఖర్ ,పరశు రాం,అధ్యాపక బృందం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కైరుప్పలలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కైరు ప్పల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్క రించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం శాఖ కార్యదర్శి రవి అధ్యక్షతన సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు లేక రోడ్డు గుంతలు పడి మురుగు నీరు రోడ్డుపైనే నిల్వ ఉంటుందని తెలిపారు. ఇంటింటికీ తాగునీటి కుళాయి వేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. లేకపోతే గ్రామస్తులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం శాఖ కార్యదర్శి పెద్ద వీరభద్ర, సీనియర్ నాయకులు నరసింహులు, సభ్యులు వెంకటేష్, వీరేష్, వీరేష్, శేఖర్, హుస్సేని, రంగన్న, రమేష్, శాంత రాజు, నాగేంద్ర, ప్రకాష్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధి అవసరం : కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి హేమలత

రైతులు పత్తి విత్తనాలు నాటేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలని, సాలుకు సాలుకు మధ్య మూడు అడుగుల దూరం పాటించాలని, మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరం పాటించాలని బనవాసి కెవికె శాస్త్రవేత్తలు తెలిపారు. శుక్రవారం పెసలదిన్నె గ్రామ రైతు సేవా కేంద్రంలో కెవికె ఆధ్వర్యంలో 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత మాట్లాడారు. పత్తి, మిరప, ఉల్లి పంటల్లో సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. అలాగే కంది పంటలో స్వల్పకాలిక రకాలు, దీర్ఘకాలిక రకాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మిగనూరు వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మాట్లాడారు. ధ్రువీకరించిన నాణ్యమైన పత్తి విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఆత్మ ఎటిఎం రామాంజినేయులు మాట్లాడుతూ... ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల గురించి, వ్యవసాయంలో అవలంభించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ ఎంవి.నిరంజన్ రెడ్డి, ఎఇఒ రసూల్, విఎఎ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి

- శ్మశాన వాటికలో మౌలిక వసతుల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు హిందూ రుద్ర శ్మశాన వాటిక భూమికి ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. శ్మశాన వాటిక భూమి సర్వే నెంబర్ 183బి మీదుగా ప్రయివేట్ వ్యక్తులకు రహదారి ఏర్పాటుకు ఆమోదించిన తీర్మానం 485పై, శ్మశాన వాటిక భూమి ఆక్రమణలపై శ్మశాన వాటిక భూమి దగ్గరకు ఆదివారం వచ్చి ఎమ్మెల్యే పరిశీలించారు. శుక్రవారం ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సమక్షంలో శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు లచ్చన్న, గణేష్, కొండయ్య, వడ్డే బజారి, పాండురంగ స్వామి, వాల్మీకి రామకృష్ణ, రామకృష్ణ, బుడగజంగాల పెద్దయ్య, జగ్గాపురం చిన్న ఈరన్న, నారాయణ, టీ స్టాల్ చంద్ర, మంగళ గిడ్డయ్య, రామస్వామి, మెకానిక్ బీరప్పతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. శ్మశాన వాటిక భూమి మీదుగా రహదారి కోసం చేసిన తీర్మానం రద్దు కోరుతూ కలెక్టర్‌కు సిఫారసు లెటర్‌ను వెంటనే పంపాలని కమిషనర్‌ను ఆదేశించారు. శ్మశాన వాటిక భూమిలో ఆక్రమణలను తొలగించి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అలాగే శ్మశాన భూమి సర్వే నెంబర్లతో కూడిన స్కెచ్‌ను కనబరుస్తూ.. అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, గ్రీన్ ప్యాచ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పరిరక్షణ సమితి నాయకులు ఉరుకుందు, యాపిలయ్య, వెంకటేష్, నాగరాజు, లోకేష్, లక్ష్మన్న, రంగన్న, దస్తగిరి, సుంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న వివిధ కుల సంఘాల నేతలు

నాణ్యత 'తుంగ'పాలు

- సిమెంట్ వినియోగంలో పొదుపు
- నేటికీ బడా కాంట్రాక్టర్ పెత్తనమే..!
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఎల్ఎల్‌సి లైనింగ్ పనుల్లో అవినీతి

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నిత్యం కరువు, వలసలతో తల్లడిల్లుతోంది. ఈ ప్రాంతంలో ఉపాధి కల్పించడం, వ్యవసాయానికి నీరు సక్రమంగా అందించాలి. పశ్చిమ ప్రాంత పల్లెసీమల జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ. ఈ కాలువ లైనింగ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కొరవడ్డాయి. సిమెంట్‌ను పొదుపుగా వాడుతున్నారు. అధికారులు మామూళ్లకు మరిగి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా వందేళ్ల పాటు రైతులకు నీరందించాల్సిన ఎల్ఎల్‌సి మరమ్మతులకు గురవుతోంది.

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

హొళగుంద హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ '0' కిలోమీటరు నుంచి ఆంధ్ర సరిహద్దులో ఉన్న హానవాల్ వద్ద 205 కిలోమీటరు వరకు ఎల్ఎల్‌సి ప్రవహిస్తోంది. కర్ణాటక రైతులు విచ్చలవిడిగా జల చౌర్యానికి పాల్పడడంతో ఆంధ్ర వాటా సక్రమంగా అందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు 115 కిలోమీటర్ల నుంచి 205 కిలోమీటర్ల వరకు దాదాపు రూ.400 కోట్లతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది దాదాపు రూ.400 కోట్లతో లైనింగ్ పనుల కోసం తుంగభద్ర బోర్డు ఇంజినీర్లు సన్నాహాలు చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పర్యవేక్షణలో ఎల్ఎల్‌సి కాలువ ఆర్‌సిసి లైనింగ్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. గతేడాది చేసిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు గాలికొదిలేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తుంగభద్ర జలాశయం నుంచి తుంగభద్ర దిగువ కాలువ కింద ఆంధ్రకు 24 టిఎంసిల నీటి వాటా ఉంది. కర్ణాటకలోని హొస్పేట్ సమీపంలో గుండ్లకేరి వద్ద 0/0 కిలోమీటరు నుంచి ఆదోని మండలం హానవాల్ దగ్గర 250.86 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువ తుంగభద్ర బోర్డు పర్యవేక్షణలో ఉంది. కాలువ గట్టు బలహీనం కావడం, పూడిక చేరడం, నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గి నీటి వాటాను కోల్పోతున్నారు. 2022-23లో తుంగభద్ర బోర్డు ఇంజినీర్లు 115.275 కిలోమీటర్ల నుంచి 205.45 కిలోమీటర్ల వరకు రూ.519.80 కోట్లతో ఆర్‌సిసి లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. 9 ప్యాకేజీలుగా విభజించి ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. అప్పట్లో కాలువకు నీరొచ్చే ముందు రాత్రి, పగలు తేడా లేకుండా.. ఇంజినీర్ల పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్లు హడావిడిగా పనులు చేపట్టారు. లైనింగ్ పనులు ఎలా చేసినా అడిగేవారే లేరని కాంట్రాక్టర్లే చెబుతున్నారు. మామూళ్ల మత్తులో పర్యవేక్షణ ఇంజినీర్లు చూసీచూడనట్లు ఉన్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో జరిగిన ఆర్‌సిసి లైనింగ్ పనులు పరిశీలిస్తే దారుణ వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. కాలువ అడుగు భాగంలో ఎర్రమట్టి వేసి గట్టి పడేలా రోలింగ్ చేసి.. దానిపై ఆర్‌సిసి బెడ్డు వేయాల్సి ఉంటే ఎర్రమట్టితో రోలింగ్ చేయకుండానే ఉన్న కాలువను చదును చేసి లైనింగ్ వేశారు. ఇనుము (స్టీల్) 10 ఎంఎం, 8 ఎంఎం కడ్డీలు వాడాలని నిబంధనల్లో ఉంటే.. తక్కువ మందం కడ్డీలు వాడారు. సిమెంట్ వినియోగంలో పొదుపు పాటించారు. ఫలితంగా వందేళ్ళు రైతన్న సేవల్లో తరించాల్సిన కాలువ లైనింగ్ పనులు ఏడాది, రెండేళ్ల గడవకనే రాళ్లు, కడ్డీలు తేలిపోవడం చూస్తే ప్రమాణాలు ఏ స్థాయిలో నీటిపాలు చేశారో అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా బోర్డు పరిధిలో జరిగే పనుల్లో బడా కాంట్రాక్టర్ పెత్తనమే నేటికీ కొనసాగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. క్యూరింగ్ విషయానికొస్తే అసలు ఆ పదాన్నే మర్చిపోయినట్లు ఉన్నారు గుత్తేదారులు, అధికారులు.

ఎల్ఎల్‌సి ఆర్‌సిసి లైనింగ్ పనులు

నాణ్యతకు తిలోదకాలు

వివిధ ప్యాకేజీల కింద విడుదలైన నిధులతో చేపడుతున్న పనులను పరిశీలిస్తే నాణ్యతా ప్రమాణాలు తుంగలో తొక్కేస్తున్నట్లు స్పష్టమవుతోంది. నిబంధనల మేరకు కాలువ గట్లను ఎర్రమట్టితో నింపి గట్టిపడేలా రోలింగ్, క్యూరింగ్ అనే పదాన్ని మార్చేసినట్లు ఉన్నారు. వాలుగా కట్ చేసిన తర్వాత దానిపై ఆరు ఇంచులకు ఒకటి చొప్పున నిలువుగా, అడ్డంగా ఇనుప కడ్డీలతో సెంట్రింగ్ చేయాలి. దానిపై ఒప్పందం మేరకు 1:1.5:2, 1:2:3 నిష్పత్తి ప్రకారం సిమెంట్, కంకర, ఇసుక మిశ్రమంతో సిసి లైనింగ్ వేయాలి. దీనికి భిన్నంగా కంకర, ఇసుక 5, 6 రెట్లు అధికంగా వాడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎర్రమట్టి స్థానంలో నల్లరేగడి మట్టిని వాడుతున్నారు. ఈ మట్టికి నీరు తగిలితే ఉబ్బే గుణం ఉండడంతో సిసి లైనింగ్ పగిలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఓ వైపు లైనింగ్ పనులు చేస్తుంటే మరో వైపు పగుళ్లు వస్తున్నాయి. కాలువకు నీళ్ల వదిలితే నాణ్యత నీటిలో కప్పేసి బిల్లులు చేసుకోవడానికి ఎత్తులు వేస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా లైనింగ్ పనులు

- రంగస్వామి, రైతు

ఎల్ఎల్‌సి కాలువ ఆధునీకీకరణలో భాగంగా చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. వెంటనే ఉన్నతాధికారుల పర్యవేక్షణ చేయాలి.

మేము కొత్తగా వచ్చాం.. మాకేమీ తెలియదు

- ఎల్ఎల్‌సి ఎఇ

మేం కొత్తగా వచ్చాం. ఈ పనులపై మాకేమీ తెలియదు. చివరకు ఆదోని సబ్ డివిజన్ ఎక్కడి నుంచి ఎక్కడ ప్రవహిస్తుందో మాకు అంతగా ఐడియా లేదు. పని జరుగుతున్న చోటు అంతా కర్ణాటక టిడి బోర్డు జెఇలు ఉన్నారు. వారిని అడగండి. చివరకు వారి ఫోన్ నెంబర్లు కూడా మా దగ్గర లేవు.

యోగా ప్రయోజనాలపై వివరిద్దాం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

రోజూ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు వివరిద్దామని ఎంపిడిఒ అల్లాబకాష్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. శుక్రవారం డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర, వివిధ రకాల సర్వేలు, మిస్సింగ్ సిటిజన్స్, హౌస్ హోల్డ్, జియో కోఆర్డినేటర్స్, ఎన్‌పిసిఐ లింకప్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. చిప్పగిరి మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఎంపికైనందున ప్రతి సర్వేనూ అనుకున్న ప్రకారం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ప్రజల దగ్గరకు చేరేలా కృషి చేయాలని తెలిపారు. కొంతమంది సచివాలయ అధికారులు అలసత్వం వహించడం మంచిది కాదని, ఇలాగే కొనసాగితే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మురుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని వారిని గుర్తించి వెంటనే నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నిర్దేశించిన సమయానికి సచివాలయ అధికారులు కార్యాలయానికి చేరుకొని బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని పెద్దబొంపల్లి గ్రామ సమీపంలో కోసిగి గ్రామానికి చెందిన ఆంజనేయ పొలంలో వేప చెట్టు కింద పేకాట ఆడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ మంజునాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్ఐ హనుమంతురెడ్డి, సిబ్బంది దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో 15 మంది పేకాట ఆడుతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.52 వేల నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తహశీల్దార్ బదిలీపై సందిగ్ధత

ప్రజాశక్తి - మంత్రాలయం

తహశీల్దార్ ఎస్.రవి బదిలీపై సందిగ్ధత నెలకొంది. జిల్లాలో జరిగిన తహశీల్దార్ల బదిలీల్లో భాగంగా మంత్రాలయంలో పని చేస్తున్న రవిని తుగ్గలి తహశీల్దార్‌గా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కె.రమాదేవిని మంత్రాలయం తహశీల్దార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం రిలీవ్ కావాల్సిన తహశీల్దార్ రవిని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హుటాహుటిన ఆదోనికి రావాలని చెప్పడంతో బదిలీపై సందిగ్ధత నెలకొంది. విధి నిర్వహణలో నిజాయితీగా ఉన్న తహశీల్దార్ రవి బదిలీపై నియోజకవర్గ నాయకులు ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడం వల్ల బదిలీ వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. మండలంలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గ్రూపులు ఉన్నాయి. రెండు గ్రూపు మధ్య ఉన్న విభేదాల వల్ల తహశీల్దార్ రవి బదిలీని మరో గ్రూపు వ్యతిరేకించడం వల్ల బదిలీని నిలుపుదల చేసే అవకాశం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి హామీ కూలీల ధర్నా

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలో నిట్రవట్టి గ్రామంలో ఉపాధి పనులు సరిగ్గా జరగడం లేదని గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడారు. తమ గ్రామంలో పనులు చేస్తున్నా వేతనాలు పడడం లేదని తెలిపారు. హాజరు పట్టికలో హాజరు కావడం లేదన్నారు. ఇలాగే వేతనాలు పడక, ఫీల్డ్ ఆఫీసర్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ జీవనం సాగక వలసలు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లి ఎంపిడిఒ వరలక్ష్మి, ఎపిఒ చక్రవర్తితో మాట్లాడారు. కూలీలు బసవరాజు, లక్ష్మన్న, శివ, రామలింగ, సోమలింగ పాల్గొన్నారు.

ప్రతి రూపాయీ భక్తుల కోసమే..!

- శరవేగంగా అభివృద్ధి పనులు
- డిప్యూటీ కమిషనర్ విజయరాజు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో భక్తులు చెల్లించే ప్రతి రూపాయీ భక్తుల సౌకర్యాల కోసమే ఖర్చు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శుక్రవారం ఉరుకుందలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటకలోని బళ్లారి పట్టణానికి చెందిన భక్తుడు బి.తిప్పయ్య ఉరుకుందలోని రూ.7 కోట్ల విలువ చేసే ఒక ఎకరా 11 సెంట్ల భూమిని దేవాలయానికి విరాళంగా అందజేశారన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి దేవస్థాన యాజమాన్యం అనేక అభివృద్ధి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పుణ్యక్షేత్రం పరిసరాల్లో తాగునీటి సౌకర్యార్థం రూ.40 లక్షలతో రెండు వాటర్ సంపుల నిర్మాణ పనులు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సౌజన్యంతో వేగంగా సాగుతున్నాయని చెప్పారు. క్షేత్రంలో నిత్యాన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో విశాలమైన అన్నదాన సత్రం నిర్మాణానికి రూ.2.30 కోట్లతో (జి ప్లస్ టు) నిర్మాణ పనులు చేపడతామన్నారు. భక్తులకు ఎండ, వర్షంలో ఇబ్బంది పడకుండా దేవస్థానం లోపల నవగ్రహ మండపం వద్ద భక్తులు, దేవస్థానం భాగస్వామ్యంతో కలర్ కోటెడ్ షీట్స్‌తో 5 షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో భక్తుల కాలికి మట్టి అంటకుండా తూర్పు రాజగోపురం ముందు సిసి ఫ్లోరింగ్, సిసి పేవర్లతో ఫ్లోరింగ్ ఏర్పాట్లు సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఉన్న 48 టాయిలెట్లకు తోడు అదనంగా కల్యాణకట్ట వద్ద 24 టాయిలెట్లు కేవలం మహిళల కోసం నిర్మిస్తున్నట్లు తెలిపారు. మూగజీవులకు భక్తుల దాతృత్వంతో గోశాల విస్తరణ పనులు ఇద్దరు దాతల సహకారంతో రూ.13 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. పుణ్యక్షేత్రానికి 70.24 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం దేవాలయానికి 24.31 ఎకరాల భూమి మాత్రం ఆధీనంలో ఉందని తెలిపారు. అన్యాక్రాంతమైన భూమికోసం రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లు చెప్పారు. ఆ భూమి కూడా రెవెన్యూ అధికారుల ద్వారా స్వాధీనం చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. పర్యవేక్షకులు వెంకటేష్, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహదేవ స్వామి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

ఇండోర్ స్టేడియాన్ని పూర్తి చేయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్‌టిసి కాలనీ, విట్టా కిష్టప్ప నగర్ పరిధిలో ఇండోర్ స్టేడియం అసంపూర్తిగా ఉందని, వెంటనే పూర్తి చేయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియాన్ని ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు శశిధర్ మాట్లాడారు. 2018లో టిడిపి ప్రభుత్వం రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ వెనుక విట్టా కిష్టప్ప నగర్‌లో జిల్లా క్రీడా ప్రాధికారక సంస్థ 2017-18లో ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పనులు మొదలు పెట్టారని తెలిపారు. ఐదేళ్ల నుంచి ఇండోర్ స్టేడియం మొండిగోడలకే పరిమితమైందని చెప్పారు. గత ఐదేళ్లలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని తెలిపారు. డివిజన్ కేంద్రమైన ఆదోనిలో ఎంతోమంది క్రీడా అభిమానులు, క్రీడా అభిరుచి కలిగిన వారు ఉన్నారన్నారు. ఇండోర్ స్టేడియం పూర్తి కాకపోవడంతో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు వేదిక లేదని తెలిపారు. క్రీడాకారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్పందించి పనులను ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్పందించి ఇండోర్ స్టేడియం పనులను వెంటనే మొదలు పెట్టి పూర్తి చేయించాలని కోరారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడాకారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, వెంకట్, ఉచ్చీరప్ప, ఉత్తేజ్, వినయ్, శివ, రాజు, వీరేష్ పాల్గొన్నారు.

భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రభుత్వం స్పందించే వరకు పోరు

- మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్లు

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకు పోరు కొనసాగిస్తామని మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్లు తెలిపారు. పట్టణంలోని భీమాస్ కూడలిలో కాంట్రాక్టు వర్కర్లు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం రెండో రోజూ సాగాయి. ఆవాజ్ కమిటీ నాయకులు ఇక్బాల్, వైసిపి నాయకులు ఫయాజ్, ఇక్బాల్, నాగేంద్ర మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పీరాసాహెబ్, సోమన్న మాట్లాడారు. స్పందించకపోతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ట్రెజరర్ హమీద్, వర్కర్లు శివకుమార్, భరత్, కర్రెప్ప, కృష్ణమూర్తి, శరథ వీరేష్, రామాంజి, శ్రీనివాసులు, తిమ్మప్ప, బాష, నూర్ ఉన్నారు.

'ఉపాధి' ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై శుక్రవారం సర్పంచి పురుషోత్తం, ఏపీవో జుబేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు ఏపీడీ పకీరప్ప తెలిపారు. కుందనగుర్తి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడారు. విచారణ చేపట్టి నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధిలో అవినీతి జరిగినట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడినట్లు నిరూపణ అయితే అధికారుల ఆదేశాల మేరకు తొలగించేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శ్రీగాయత్రి దేవి జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని శంకర బండ గ్రామ రామతీర్థం కొండల్లో శ్రీగాయత్రీ దేవి జయంత్యుత్సవాలను అర్చకులు రూపం మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జయంతి సందర్భంగా గాయత్రి దేవి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చింది. ఉదయం అమ్మవారికి, వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు గాయత్రి హోమం చేశారు. అమ్మవారికి భక్తులు ఒడి బియ్యాన్ని సమర్పించి దర్శించుకున్నారు. గాయత్రీ సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని అర్చకులు తెలిపారు.

శ్రీమఠంలో విద్యాదానానికి విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో నిర్వహించే విద్యా దానానికి భక్తుల నుంచి రూ.1.18 లక్షల వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరుకు దివిజ హన్విక సింగనమల అనే భక్తురాలు రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చారని చెప్పారు. దర్శన అనంతరం శ్రీమఠంలో నిర్వహణలో నడుస్తున్న విద్యాదానానికి సహాయంగా విరాళం ఇచ్చారని తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నంచర్ల గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న తాగునీటి సమస్యను పరిష్కారం చూపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి శివలింగ, మాజీ ఎంపిటిసి సంజీవ రాయుడు సమక్షంలో జిల్లా పరిషత్ నిధులతో కొత్తగా బోరు వేయించారు. గ్రామంలో అభివృద్ధి పనులు జరగాలంటే టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించడంతో గ్రామస్తులు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో వెలసిన శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆలయ వంశంపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 150 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. శాస్త్రోక్తంగా సాగిన కార్యక్రమంలో చిన్నారులతో అక్షరాలు దిద్దించిన అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

'వెన్నుపోటు' ఎవరికి వర్తిస్తుందో ప్రజలకు తెలుసు

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి

వెన్నుపోటు అనే పదం ఎవరికి వర్తిస్తుందో రాష్ట్రంలో ప్రజలందరికీ తెలుసని వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య విమర్శించారు. శుక్రవారం చిప్పగిరిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్న ఐదేళ్లలో రెండేళ్లు కరోనాలో పోయిందని, అనుకున్న ప్రకారం సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికి దక్కుతుందని తెలిపారు. నిరుపేదల కోసం అహర్నిశలు పని చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను మభ్యపెడుతున్నది ఎవరో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా పేదలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు ఇవ్వడానికి ఖజానా ఖాళీగా ఉందని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విమర్శలు మాని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. వైసిపి నాయకులు లాలు స్వామి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'ఒయాసిస్ జనని'ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని

సంతానం కలగక తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియక, సందేహాలను నివృత్తి పరుచుకునేందుకు ఇబ్బందులు పడుతున్న దంపతులకు అవకాశాలు ఉన్నాయని, అలాంటివారు ఒయాసిస్ జనని బస్సు యాత్ర నిర్వాహకులను సంప్రదించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఒయాసిస్ జనని బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోనిలో ప్రత్యేకంగా ఉచిత ఫెర్టిలిటీ అవగాహన క్యాంపు నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రతిష్టాత్మకమైన ఆరోగ్య సేవలను అందించడంలో ఒయాసిస్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడారు. చాలామందికి ఫెర్టిలిటీ పద్ధతిపై అవగాహన లేదని, సందేహాలు నివృత్తి చేసేందుకే బస్సు యాత్ర కొనసాగిస్తూ క్యాంపులు కొనసాగిస్తున్నామని తెలిపారు. కర్నూలు ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినికల్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... చాలామంది దంపతులు ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటికీ సదుపాయాల గురించి అవగాహన లేక విలువైన సమయాన్ని కోల్పోతున్నారని చెప్పారు. మరిన్ని వివరాలకు 9160339911 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

షైనింగ్ స్టార్స్ అవార్డుకు అఖిల

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ ఎఫ్ఆర్ హైస్కూల్‌లో 10వ తరగతి చదివిన బండారి అఖిల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ పి.రఘునాథ్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. విద్యార్థికి షైనింగ్ అవార్డుతో పాటు మెడల్, రూ.20 వేల నగదును ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించినట్లు తెలిపారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. అలాగే ఈ అవార్డుల వల్ల కుటుంబాలకు సమాజంలో మంచి గౌరవం కూడా లభిస్తుందని తెలిపారు. అవార్డులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఇలాంటి అవార్డులు పాఠశాల విద్యార్థికి రావడం సంతోషంగా ఉందని తెలిపారు. బండారి అఖిలను అభినందిస్తున్నట్లు చెప్పారు.

ఐఐటి, జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో

'జీనియస్' విద్యార్థికి ఆలిండియా ర్యాంకు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఐఐటి, జెఇఇ అడ్వాన్స్ పరీక్షల్లో పట్టణానికి చెందిన జీనియస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి చిక్కం అనూహ్య మాధురి 3,610 ర్యాంకు సాధించారు. శుక్రవారం కళాశాలలో కరస్పాండెంట్ గురుజాల గంగాధర్ రెడ్డి విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల స్థాపించిన మొదటి బ్యాచిలోనే తమ విద్యార్థి ఆలిండియా ర్యాంకు సాధించడం హర్షనీయమన్నారు. పట్టణ చరిత్రలో ఆలిండియా ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించామని తెలిపారు. తమ కళాశాలపై నమ్మకం ఉంచిన విద్యార్థికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ర్యాంకు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న గంగాధర్ రెడ్డి

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఎ.యస్.నెం.15/2024
డి.యస్.సాయిలీల పోతివారసులు
పి.మీనాక్షి మిథిలేశ్వరరెడ్డి వగైరా ... అప్పిలెంట్లు
-వర్సెస్-
దుగ్గిరెడ్డి సురేఖగారి పి.సాయిలీల వగైరా
... రెస్పాండెంట్లు
1,2 రెస్పాండెంట్లకు అప్పీలు నోటీసులు
1.దుగ్గిరెడ్డి సురేఖగారి పి.సాయిలీల
భర్త పి.శివప్రసాద్‌రెడ్డి, ప్లాటు నెం.38, ప్రేమ్‌నగర్, నంద్యాలరోడ్డు, కర్నూలు.
ప్రస్తుతం. ఇంటి.నం. 27-215-6, శ్రీనివాసనగర్, మహబూబ్‌నగర్.
2.యం.గిరిధర్ గౌడ్ తండ్రి యం.చంద్రయ్యగౌడ్, ఇంటి.నం.77/206-22, వెంకటాచలపతి నగర్, కల్లూరు ఎస్టేట్, కర్నూలు.
పై నంబరు అప్పీలులోఅప్పీలెంట్లు, కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కర్నూలు ఒ.యస్.నెం.111/2012 తేది 23-1-2024 వ తేది తీర్పుపైన అప్పీలు చేసినారు.ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 25-6-2025 తేది పగలు 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరె పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అప్పీలును నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 25-6-2025
ఎ.రామసుబ్బారెడ్డి
ఎ.ప్రభాకర్‌రెడ్డి,
అప్పిలెంటు పరం అడ్వకేట్లు,
కర్నూలు.